క్లుప్తంగా

చురుగ్గా సీసీ రోడ్డు పనులు



సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

సీతానగరం: మండలంలోని పెదబోగిలి పంచాయతీ ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం నుంచి సచివాలయం వరకు రూ. 4.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. రహదారి పనులను పీఆర్ ఏఈలు చంద్రమౌళి, సంతోష్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 117 మీటర్ల పొడవున సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గరికయ్య, సర్పంచ్ జె. తేరేజమ్మ, ఉపసర్పంచ్ కె. అరవింద్‌కుమార్ పాల్గొన్నారు.

నూతన శివాలయంలో యాగాలు



యాగం నిర్వహిస్తున్న అర్చకులు

పార్వతీపురం రూరల్: మండలంలోని తాళ్లబురిడిలో నూతనంగా నిర్మించిన శివాలయంలో ప్రత్యేక పూజలు రెండో రోజైన ఆదివారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా ప్రాతఃకాల ఉపాసనాలు, త్రిచ, అరుణ, సౌర పారాయణ సహిత సూర్య నమస్కారాలు, హోమాలు, క్షీరాధివాసం ధాన్యాధివాసం.. సాయంకాలం ఔపాసన, మంటపారాధనలు, మహాలింగార్చన సహిత రుద్రాభిషేకం, పంచశయ్యాధివాసం, వేదస్వస్తి, తదితర పూజా కార్యక్రమాలను చిలకలపల్లికి చెందిన శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం దేవాతా మూర్తుల విగ్రహాలు ప్రతిష్ఠించనున్నట్లు కమిటీ సభ్యుడు బలగ నాగేశ్వరరావు తెలిపారు.

క్లస్టర్ సమావేశాలతో ఉపాధ్యాయులకు ఇబ్బందులు

వీరఘట్టం: రాష్ట్ర విద్యాశాఖ కొత్తగా నిర్వహిస్తున్న క్లస్టర్ సమావేశాలతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు అన్నారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ క్లస్టర్ విధానంతో అటు విద్యార్థులకు ఇటు ఉపాధ్యాయులకు గానీ ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. కనీస పాఠశాల అభివృద్ధికి కూడా దోహదపడని సమావేశాలతో ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. క్లస్టర్ సమావేశాల్లో ఎక్కువగా ఎస్జీటీలే పాల్గొంటున్నారని, సబ్జెక్టు టీచర్లు ఒకరిద్దరే పాల్గొంటున్నారన్నారు. బోధన నైపుణ్యాలు నేర్పించేందుకు నిర్వహిస్తున్న డిజిటల్ తరగతులకు నెట్‌వర్క్ సమస్యలు తలనొప్పిగా మారాయన్నారు. క్లస్టర్ విధానానికి బదులు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలే తీసుకురావాలని కోరారు.

భానుడి ప్రతాపం



నిర్మానుష్యంగా కనిపిస్తున్న గుమ్మలక్ష్మీపురంలోని ఓ వీధి

గుమ్మలక్ష్మీపురం: భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. వేసవి ప్రారంభమైందనే సంకేతాలు వెలువడేలా సూర్యుడు భగభగమంటున్నాడు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. గత వారం రోజులుగా ఇదే మాదిరి వాతావరణం కొనసాగుతోంది. 30 నుంచి 32 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న వేసవి రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి సంబరాలు

రాజాం: మండలంలోని నరసింహపురంలో లక్ష్మీనరసింహస్వామి, రాములు వారి సంబరాలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. రెండేళ్లకోసారి చేసే ఈ సంబరాలు ఎంతో వేడుకగా జరుపుకుంటామని గ్రామస్తులు చెబుతున్నారు. సంబరాల్లో భాగంగా దేవుడి ఇంటి వద్ద పందిరి వేసి అరటిగెలలు వేలాడదీసి పందిరిపాట కార్యక్రమం చేపట్టారు.

ముగిసిన రాములోరి సంబరాలు

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాములు వారి సంబరాలు ఆదివారంతో ముగిశాయి. గార కుటుంబీకుల కులదైవమైన రాముని ప్రతిమను ఊరేగించారు.

ప్రజారోగ్యం గాలికేనా..!

- యూపీహెచ్‌సీ భవనం పూర్తయినా పట్టించుకోని అధికారులు
- రాజకీయ కక్ష సాధింపులతో ప్రారంభానికి నోచుకోని వైనం



గత ప్రభుత్వ హయాంలో పూర్తయిన యూపీహెచ్‌సీ భవనం

పార్వతీపురం టౌన్:

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అన్నివర్గాల వారిని మోసం చేయడమే కాకుండా అభివృద్ధిని సైతం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించడం లేదని చెప్పడానికి పార్వతీపురం యూపీహెచ్‌సీ (అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్) భవనమే నిదర్శనం. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రలో 16వ వార్డు పరిధి బెలగాంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యం కేంద్ర భవనం నిర్మాణం పూర్తయినా ఇంతవరకు ప్రారంభించ లేదు. గత ప్రభుత్వ హయాంలో యూపీహెచ్‌సీ నిర్మాణం పూర్తయింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం భవనాన్ని ప్రారంభించకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. బెలగాం, బాలగుడబ, బంగారమ్మ కాలనీతో పాటు సమీప ఐదు గ్రామాల ప్రజలకు ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) ఎంతో ఉపయోగకరం. అయితే నూతన భవనం నిర్మించినప్పుడు పాత భవనం పూర్తిగా తొలగించారు. సిబ్బందిని వేర్వేరు పీహెచ్‌సీలకు బదలించారు. ప్రస్తుతం భవనం అందుబాటులో ఉన్నా.. వైఎస్సార్‌సీపీ హయాంలో పూర్తయిన భవనం కావడంతో కూటమి నాయకులు కావాలనే ప్రారంభించడం లేదు. దీంతో వైద్యసేవలు అందక ఇబ్బంది పడుతున్నామని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. రాజకీయ కక్షలు పక్కనబెట్టి అందుబాటులో ఉన్న భవనాన్ని ప్రారంభించి సిబ్బంది నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

త్వరగా ప్రారంభించాలి..



పూర్తి చేసిన భవన నిర్మాణాన్ని ఇంకా ప్రారంభించడం లేదు. ఈ యూపీహెచ్‌సీ వల్ల స్థానిక ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుంది. అత్యవసర పరిస్థితులల్లో జిల్లా ఆస్పత్రికి వెళ్లాంటే మార్గ మధ్యలో రైల్వేగేట్ ఉండడంతో వెళ్లలేకపోతున్నాం. పాలకులు, ఉన్నతాధికారులు దృష్టి సారించి తక్షణమే భవనాన్ని ప్రారంభించాలి.

–నల్ల కృష్ణవేణి, పట్టణ వాసి

పలుమార్లు విన్నవించాం..



ఐదు గ్రామాల ప్రజలకు ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంతో ఉపయోగకరం. యూపీహెచ్‌సీని ప్రారంభించాలని గతంలో అధికారులకు వినతిపత్రాలు అందజేశాం. అయినా ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. ఇప్పటికైనా పాలకులు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని యూపీహెచ్‌సీని అందుబాటులోకి తీసుకురావాలి.

–చక్ర ప్రసాదరావు, పట్టణ వాసి

సరైన విధానం కాదు..



కట్టించిన భవనాన్ని ఇంత వరకు ప్రారంభించకపోవడం సరైన విధానం కాదు. బాలగుడబ, బంగారమ్మ కాలనీలతో పాటు ఐదు గ్రామాల ప్రజలకు ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంతో ఉపయోగకరం. అధికారులు తక్షణమే స్పందించాలి.

– దాసరి ఈశ్వరరావు, పట్టణ వాసి

ఏపీటీఎఫ్ ఎన్నికల కార్యాలయం ప్రారంభం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు, ప్రతినిధులు

పార్వతీపురం టౌన్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి శాసన మండలికి పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మ తరఫున ప్రచారం నిర్వహించడానికి పట్టణంలో కార్యాలయం ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు బెహరా గుంపస్వామి ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్యాగానికి, నిజాయితీకి ప్రతీకగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యాయుల సంక్షేమానికే కట్టుబడి ఉందన్నారు. అటువంటి ఫెడరేషన్ కార్యకర్త శాసనమండలి సభ్యుడిగా ఎన్నికైతే ఉపాధ్యాయులకు మేలు జరుగుతుందని చెప్పారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు పాకలపాటి రఘువర్మకు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రావాడ అప్పలనాయుడు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వామినాయుడు, అప్పలనాయుడు, మండల మురళి, సంతోష్, కొర్లాపు శ్రీనివాస్, జగదీష్ , శుభాకర్, సీనియర్ నాయకులు గుల్లదాలినాయుడు, ఆనందగజపతి, గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయండి..



సమావేశంలో మాట్లాడుతున్న అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ

పార్వతీపురం టౌన్: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. సోమవారం చేపట్టనున్న ధర్నాలను విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, జిల్లా కోశాధికారి జి.వెంకటరమణతో కలిసి ఆమె మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మినిట్స్ కాపీ హామీలు అమలు చేయాలని కోరుతూ అనేక దఫాలుగా మంత్రుల నుంచి ముఖ్యమంత్రి వరకు విన్నవించుకున్నామన్నారు. కాని నేటికీ ఏ ఒక్క సమస్యా పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ అంగన్‌వాడీ సిబ్బంది జీతాలు పెరగడం లేదన్నారు. అంగన్‌వాడీ సిబ్బందికి గ్రాట్యుటీ ఇస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ఇవ్వలేదని చెప్పారు. అలాగే చాలీచాలని జీతాలతో సిబ్బంది కుటుంబాలను నెట్టుకొస్తున్నారని వాపోయారు. సిబ్బందికి జీతం పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ధర్నాలను విజయవంతం చేయాలని కోరారు.

పర్తి యాత్రకు సన్నద్ధం కావాలి



సమావేశానికి హాజరైన సత్యసాయి భక్తులు

వీరఘట్టం: పుట్టపర్తిలో నవంబరులో జరిగే పర్తి యాత్రకు సత్యసాయి భక్తులంతా సన్నద్ధం కావాలని పార్వతీపురం మన్యం జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు పి.నేతాజీనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని చిట్టపులివలస గ్రామంలో ఉన్న సత్యసాయి నిత్యాన్నదాన సత్రంలో సత్యసాయి భక్తులు, సత్యసాయి సేవాసంస్థల ప్రతినిధులు, సత్యసాయి సమితి కన్వీనర్లు, కార్యదర్శులతో ఆయన ఆదివారం సమావేశమై, పలు సూచనలు చేశారు. యాత్రకు ఏయే మండలాల నుంచి ఎంతమంది రావొచ్చన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. నవంబరు 23న సత్యసాయిబాబా శతజయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో అన్ని మండలాల సత్యసాయి సమితి కన్వీనర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

25 మందిపై కేసు నమోదు

వీరఘట్టం: స్థానిక రామమందిరం జంక్షన్ నుంచి బీఎంఆర్ థియేటర్ వరకు బార్నాల వీధి రోడ్డులోని 25 మంది వ్యాపారులపై న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.కళాధర్ ఆదివారం తెలిపారు. నిత్యం అదే రోడ్డులో వారు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నందున వారిపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

క్లోరినేషన్ చేపడుతున్నాం..

సీతానగరం: మండలంలోని సువర్ణముఖీ నది నుంచి నీరు సరఫరా చేస్తున్న మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చేయడంతో పాటు ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల్లో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్నట్లు ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ అన్నారు. మండలంలోని గుచ్చిమి, సూరంపేట గ్రామాల్లో సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు చేయిస్తున్న పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సంబన్నం దొర, ఎం. శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు మురళీ, లక్ష్మి, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పాలకొండ రూరల్: ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పాలకొండ సీఐ మీసాల చంద్రమౌళి సూచించారు. స్థానిక పట్టణంలోని కోటదుర్గమ్మ దేవస్థానం కూడలి సహా రాజాం, వీరఘట్టం, సీతంపేట రోడ్లలో పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. అటువైపుగా వస్తూ పోతున్న వారి వాహనాలను ఆపి, వాహనదారుల లైసెన్స్, వారి వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యంతాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపొద్దని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని తెలిపారు. అలాగే హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు అపరాద రుసుం విధించారు.

కోటదుర్గమ్మకు సంబర నీరాజనం

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం కోటదుర్గమ్మకు భక్తులు సంబర నీరాజనం పలికారు. ఇటీవల వివాహం చేసుకున్న నూతన వధూవరులు, గ్రామీణులు చేసుకునే సంబరాల్లో భాగంగా వారంతా ఆదివారం ముర్రాటలు, ఘటాలతో ఆలయానికి చేరుకుని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ భక్తులు సమర్పించిన ప్రసాదాలను అమ్మవారికి నివేదించారు.

విద్యార్థుల చదువుపై దృష్టి సారించాలి

పాలకొండ రూరల్: విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు కూడా ప్రత్యేక దృష్టి సారించాలని చినమంగళాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సూచించారు. మండలంలోని ఆదే గ్రామంలో పదో తరగతి విద్యార్థుల ఇళ్ల వద్దకు వారు వెళ్లి, వారు ఏ విధంగా చదువుతున్నదీ తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. సెలవు రోజుల్లో కూడా ఇంటి వద్ద విద్యార్థులు బాగా చదువుకునే వాతావరణాన్ని కల్పించాలని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి పని ఒత్తిడి లేకుండా చూడాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగానే ఇంటింటికీ వెళ్లి, విద్యార్థుల చదువుపై ఆరాతీస్తున్నామన్నారు.

ప్రతి ఒక్కరినీ నడిపించాలి..



ఎన్నికైన నూతన కార్యవర్గం

పార్వతీపురం టౌన్: మనం నడుస్తూ ప్రతి ఒక్కరినీ నడిపించాలని వాకర్స్ ఇంటర్నేషనల్ 102 డిస్ట్రిక్ పాస్ట్ గవర్నర్ జె.నారాయణస్వామి అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మార్నింగ్ స్టార్ వాకర్స్ క్లబ్ మూడో వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నడకతోనే ఆరోగ్యం అన్న నినాదంతో వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ పని చేస్తోందన్నారు. నేటి సమాజంలో అన్ని వయసుల వారు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. బీపీ, సుగర్ వంటి వ్యాధులు మానసిక ఒత్తిడి వల్లే వస్తున్నాయని తెలిపారు. నడవడం వల్ల మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని చెప్పారు.

నూతన కార్యవరం ఎన్నిక

మార్నింగ్ స్టార్ వాకర్స్ క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పి.సత్యనారాయణ, ఎం.మహీపతిలతో పాటు ఇతర సభ్యులతో నారాయణస్వామి ప్రమాణస్వీకారం చేయించారు. నూతన క్లబ్ ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు, సెక్రటరీగా పి.మార్కండేయులు, కోశాధికారిగా ఎం. శ్రీధర్, గౌరవ అధ్యక్షుడిగా జీవీఆర్ఎస్ కిశోర్, పి.చిన్నంనాయుడు, ముఖ్య సలహాదారులుగా ఎం. రవికుమార్, వి.చిన్నారావు. కె.నాగు, మీడియా కో ఆర్డినేటర్‌గా ఎస్. గౌరీశంకరరావు ఎంపికయ్యారు.

'మోటివేటర్స్‌గా నియమించడం దారుణం'



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు

పార్వతీపురం టౌన్: ఫౌండేషన్ స్కూల్స్ ఏర్పాటుకు, మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటుకు ఉపాధ్యాయులనే మోటివేటర్లుగా ఉండాలనడం దారుణమని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో యూటీఎఫ్ ముఖ్య కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠాలల్లో 3,4,5 తరగతులను ఎత్తివేసి ఫౌండేషన్ స్కూల్స్‌గా మార్చడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. దీని పర్యవేక్షణకు ఉపాధ్యాయులను నియమించడం సరికాదన్నారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కె. విజయగౌరిని బలపరచాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. మురళీ మోహనరావు, జిల్లా అధ్యక్షుడు టి. రమేష్, జిల్లా సహాధ్యక్షురాలు యు. జ్యోతి, ట్రెజరర్ కె. మురళీ, ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బ్రాండెడ్ మద్యం ఎక్కడ..?



సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల నిర్వాహకులు సిండికేట్ ఏర్పడి బ్రాండెడ్ మద్యం అమ్మడం మానేశారని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు శివకృష్ణ ఆరోపించారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైన్ షాపుల్లో బ్రాండెడ్ మద్యం లభించడం లేదని, ఫోన్ పే కూడా తీసుకోవడం లేదనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే పట్టించుకోవాలని కోరారు. లేకుంటే ఈ విషయాన్ని జిల్లా మంత్రి దృష్టికి తీసుకువెళ్లి నిబంధనలు పాటించని షాపుల లైసెన్స్‌లు రద్దు చేసేలా ఒత్తిడి తీసుకువస్తామన్నారు. పేదలకు, రోజు వారీ కూలీలకు తక్కువ ధరకు మద్యం అందుబాటులో ఉంచాలని కోరారు.

నీటి పొదుపు పాటించాలి..



ప్రజలు నీటి పొదుపు పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్. పవన్‌కుమార్ సూచించారు. సీతానగరం మండలంలోని జోగింపేట, గుచ్చిమి గ్రామాల్లో ఆయన పర్యవేక్షణలో మెకానిక్‌లు సత్యనారాయణ, కృష్ణ పలు బోరుబావులకు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోర్లకు మరమ్మతులు చేపట్టడానికి అవసరమైన మెటీరియల్ మండల కేంద్రానికి చేరుకుందన్నారు. బోర్లు పాడైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

– సీతానగరం

నత్తనడకన మరమ్మతులు..



బలిజిపేట మండలం చిలకలపల్లి – వంతరాం ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నత్తనడకన సాగుతున్నాయి. డిసెంబర్ నెలలో ప్రారంభించిన మరమ్మతులు నేటికీ పూర్తి కాకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై ఉన్న గుంతలను పూర్తిస్థాయిలో కప్పకుండా వదిలివేయడం, వెట్‌మిక్స్ వేసి రోలింగ్ చేయకపోవడంపై వాహన చోదకులు మండిపడుతున్నారు. చిలకలపల్లి నుంచి వంతరాం వరకు ఆరు కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులకు రూ. 30 లక్షలు మంజూరయ్యాయి. దీనిపై ఏఈ రామ్మోహన్ వద్ద ప్రస్తావించగా..పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

– బలిజిపేట

ఒకవైపు నుంచే వెళ్లాలి..



బలిజిపేట మండలం నూకలవాడ జంక్షన్ దాటిన తర్వాత వంతరాం వరకు గల రహదారిపై వాహనాల రాకపోకలు ఒకవైపు నుంచి మాత్రమే సాగుతున్నాయి. రహదారిపై సగం వరకు జొన్నపిక్కలు ఎండవేయడం.. అపరాల పంట ఎండవేతలతో రహదారిని పూర్తిగా కప్పేస్తున్నారు. దీంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై పంటలు ఎండవేయకుండా చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

– బలిజిపేట

పొగమంచుతో అవస్థలు..

మంచు ప్రభావం ఇంకా వీడడం లేదు. ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు విపరీతంగా కురుస్తుండడంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. బలిజిపేట మండలంలో బలిజిపేట – బొబ్బిలి రహదారిపై ఆదివారం ఉదయం 9 గంటల వరకు పొగ మంచు కురవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని మరీ రాకపోకలు సాగించాల్సి వచ్చింది.అలాగే పార్వతీపురం మండలంలో వెంకంపేట, చినబొండపల్లి, సంగంవలస, ములగ, తదితర గ్రామాలను పొగ మంచు వీడడం లేదు. మంచు వల్ల మామిడి, జీడి పూత మాడిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. – బలిజిపేట/పార్వతీపురం రూరల్



బలిజిపేట - బొబ్బిలి రహదారిలో పొగమంచు



పార్వతీపురం రూరల్: నర్సిపురం వద్ద జాతీయ రహదారిపై కురుస్తున్న మంచు